క్లుప్తంగా

వైభవంగా చందనోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డి నాగసాయిబాబా–శ్రీ నాగ మానసాదేవి మందిరంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో స్వామి వార్లకు చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయిబాబాకు గంధం అభిషేకం చేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వయంగా బాబాకు గంధం సమర్పించారు. బాబాకు హారతి అనంతరం అన్నసమారాధన జరిగింది. బాబా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. మహిళా భక్తులతో పాటు ఫకీర్ బాబాలు భజనలతో ఊరేగింపు సాగింది. ఊరేగింపు అనంతరం మల్లాది విష్ణు చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, నాయకులు అంజిబాబు, రత్నారావు పాల్గొన్నారు.

3 నుంచి సంగీత, సాహిత్య ఉత్సవాలు

విజయవాడకల్చరల్: సంగీత విద్యాంసులు వలివేటి వేంకట లక్ష్మీనరసింహం 78వ జయంతి సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దుర్గాపురంలోని సంగీత కళాశాలలో వీవీఎల్ఎన్ శిష్య బృందం ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య నృత్య ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘ సభ్యులు వలివేటి శివరామకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ సోమవారం సాయంత్రం హేమంత్‌కుమార్ బృందంచే శివతాండవ సప్తకం నృత్య రూపకం, ఆమని అతిథి గ్రంథావిష్కరణ, మంగళవారం భక్తిభావ గీతాలాపన, బుధవారం హరిమేలె కొలుపు సంగీత విభావరి సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావుకు సంగీత సాహిత్యరత్న పురస్కారంతో సత్కరిస్తామని చెప్పారు.

దంతాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ శరీరంలో దంతాలు ఎంతో ప్రధానమైనవని, దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంపై విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు శుక్రవారం ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు టూత్‌బ్రష్‌లు, పేస్టులు పంపిణీ చేశారు. డాక్టర్లు ప్రియ, దివ్య, నేహా, పాఠశాల హెచ్ఎం ఎంఎస్ ఇమామ్‌బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ఎంతో పుణ్యమని, ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పాదిగింటి నాగరాజు అన్నారు. ఆ సంస్థ సభ్యుల ఆత్మీయ సమావేశ కార్యక్రమం 60వ డివిజన్ వాంబేకాలనీ కమ్యూనిటీ హాలులో శుక్రవారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో జనంలో మనం అనే సేవా సంస్థను ఏర్పాటుచేసి చెన్నై, విజయవాడ నగరాలలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సంస్థ సేవలను మరింతగా విస్తరిస్తామని తెలిపారు. అనంతరం పేద ప్రజలకు భోజన పొట్లాలు, కొంత మందికి ఆర్థిక సహాయం అందజేశారు.

నాగమల్లేశ్వరరావు బదిలీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయ మేనేజర్‌గా పని చేసిన బలిజేపల్లి నాగమల్లేశ్వరరావు బదిలీ అయ్యారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్‌గా వెళ్లారు. జవహర్ ఆటోనగర్‌లో నాగమల్లేశ్వరరావు ఆటోనగర్‌లోని జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయ మేనేజరుగా ఐదేళ్లు పనిచేశారు. ఈయన స్థానంలో కృష్ణాజిల్లా డీఈఓ కార్యాలయంలో పనిచేసిన ఆంజనేయులు పదోన్నతిపై ఎన్టీఆర్ జిల్లా జవహర్ ఆటోనగర్‌లోని ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయ మేనేజరుగా బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టారు.

అక్కచెల్లెమ్మల ఆర్థిక వికాసమే లక్ష్యం

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

సత్యనారాయణపురం(విజయవాడ): అక్కచెల్లెమ్మల ఆర్థిక వికాసం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కు వద్ద శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు ఘనంగా జరిగాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రూ.26 వేల కోట్ల లబ్ధి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళ సంతోషంగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. చిరు వ్యాపారాలతో, అత్యంత స్వల్ప మొత్తాలతో వారు కుటుంబాన్ని నడిపించే తీరు అద్భుతమని కొనియాడారు. ఇప్పటి వరకు రూ.2.25 లక్షల కోట్ల విలువైన సంక్షేమాన్ని మహిళలకు అందించిందని తెలిపారు. అక్కచెల్లెమ్మలకు ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం కూడా లబ్ధి చేకూర్చలేదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేయడంతో ఏ గ్రేడ్ గ్రూపులన్నీ ఆర్థిక క్రమశిక్షణ కోల్పోయి డి గ్రేడ్‌లోకి పడిపోయాయని గుర్తుచేశారు. మూడో విడత ఆసరా ద్వారా 33వ డివిజన్‌ని 69 గ్రూపుల్లో రూ.68 లక్షల 91 వేల 188 నిధులు జమ చేశామన్నారు.

జీవన చిత్రాన్ని సీఎం వైఎస్ జగన్ మార్చారు..

జీవనోపాధులైన రిటైల్ అమ్మకాలు, పాడి పరిశ్రమ, ఇతర ఉత్పత్తుల ద్వారా నెలనెలా ఆదాయం పొందేలా డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం సహకరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం అమూల్, హిందుస్తాన్ యూనిలీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే డివిజన్లో 1,200 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ పేదవాడికి చేయూతనిచ్చే నవరత్న పథకాలను సృష్టించి, వారి జీవన చిత్రాన్ని మార్చిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందని తెలిపారు. మహిళల ఖాతాల్లో నగదు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ మెచ్చుకుంటున్నారన్నారు. ఇవి ప్రతిపక్ష నేతలకు కనబడడం లేదన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజనా, సీడీఓ జగదీశ్వరి, నాయకులు మైలవరపు రాము, లంకా బాబు, కమ్మిలి రత్నకుమార్, కొల్లూరు రామకృష్ణ, చల్లాప్రగడ గోపాలకృష్ణ, చాంద్ శర్మ, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



పొదుపు సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో మహిళల్లో ఆర్థిక చైతన్యం వస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గాంధీనగర్ జింఖానా గ్రౌండ్ నందు శుక్రవారం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి అక్కచెల్లెమ్మలకు ఆసరా ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. మూడో విడత ఆసరా ద్వారా డివిజన్ లోని 112 గ్రూపుల్లో రూ.కోటి 14 లక్షల 8 వేల 677 రూపాయల నిధులు జమ చేసినట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను ఆసరాగా తీసుకుని గత పాలకులు, జన్మభూమి కమిటీలు పేదలను నిలువునా మోసగించాయని విష్ణు ఆరోపించారు. కనీసం స్థలాలు కూడా లేకుండా టిడ్కో ఇళ్ల పేరిట పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. కేవలం కాగితాలలోనే ఇళ్లను చూపి.. ఒక్కో లబ్ధిదారుని వద్ద రూ. 50 నుంచి రూ. లక్ష వరకు అప్లికేషన్ల రూపంలో దోచుకున్నారన్నారు. ఇందులో 6,576 ఇళ్లు 50 శాతం కూడా పూర్తికాలేదని.. 5,341 మందికి కనీసం స్థలం కూడా చూపలేదన్నారు. అయినా కూడా నగరంలో 11,917 మందికి ఆర్డర్ కాపీలను ఇచ్చారని దుయ్యబట్టారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వానికి మహిళలంతా అండగా నిలవాలన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలి గోవింద్, యూసీడీ పీఓ కె.శకుంతల, సీడీఓ జగదీశ్వరి, నాయకులు పులపా కృష్ణ, గడ్డం రామకృష్ణ, ఆత్మకూరు సురేష్, పఠాన్ భూపతిరెడ్డి, రాంబాబు, రాడ భాస్కర్ రావు, పప్పుల శివ, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మూడేళ్లలో రూ.90.05 కోట్ల లబ్ధి

సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో 1,01,046 మంది మహిళలకు రూ.90.05 కోట్లు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది.

రికార్డు స్థాయిలో పన్నుల వసూళ్లు

- మార్చి 31న ఆస్తి పన్ను రూ.5.20 కోట్ల వసూలు
- పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకున్న వీఎంసీ



వీఎంసీ ప్రధాన కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన శుక్రవారం రికార్డు స్థాయిలో పన్నుల వసూళ్లు చేసింది. దశాబ్ద కాలంలో లేని విధంగా పన్నులు వసూళ్లు చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.177 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉంటే అందులో రూ.138.55 కోట్లను వీఎంసీ రెవెన్యూ సిబ్బంది వసూళ్లు చేశారు. పన్నుల చెల్లింపులు చివరి గడువైన మార్చి 31వ తేదీన గతేడాది రూ. 3.58 కోట్లు వసూళ్లయితే ఈ ఏడాది రూ. 5.20 కోట్లు వసూళ్లయ్యాయి. గతేడాది రూ.93 కోట్లు మాత్రమే వసూల్లు చేస్తే ఈ ఏడాది రూ.138.55 కోట్లు వసూళ్లు చేశారు. నీటి పన్నుకు రూ. 64 కోట్లు డిమాండ్ ఉండగా గతేడాది రూ.28.33 కోట్లు వసూళ్లు చేస్తే ఈ ఏడాది రూ.36 కోట్లు వసూళ్లయ్యింది. ఖాళీ స్థలాలకు అధికంగా రూ.200 కోట్లు డిమాండ్ ఉండగా ఈ ఏడాది రూ. 34.25 కోట్లు వసూళ్లయ్యాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) రూ.42 కోట్లు డిమాండ్ ఉండగా ఈ ఏడాది రూ.20.20 కోట్లు వసూళ్లయ్యాయి.

ప్రత్యేక జీఓ కారణంగా

ఆస్తి, ఖాళీస్థలాల పన్నులపై టీడీపీ ప్రభుత్వం వడ్డీ మాఫీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు మార్చి నెల 16వ తేదీన రాష్ట్ర మున్సిపల్ శాఖ జీఓ నంబర్ 34 తీసుకువచ్చింది. దీంతో ఈ ఏడాది పన్నుల వసూళ్లలో వేగం పెరిగిందని, నగరంలోని దీర్ఘకాలికంగా ఉన్న నివేశస్థలాలు, గృహ, వాణిజ్య పన్నులు వేగం పెరిగి అధిక రాబడి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు.

విస్తృత ప్రచారం చేశాం

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నుల వ్యవహారంలో వార్డు సచివాలయ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకుని అధికంగా పన్నులు రాబట్టాం. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 34తో బకాయిదారులు పేరుకుపోయిన పన్నులను చెల్లింపులు చేశారు.

– డి.వెంకటలక్ష్మి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ)

సామూహిక లలితా సహస్రనామ పారాయణం



పూజా సామగ్రితో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

విజయవాడకల్చరల్: లలితా సహస్రనామ పారాయణం భక్తి, ముక్తిదాయకమని తాడేపల్లి చైతన్యతపోవనం పీఠాధిపతి మాతా శివానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. జయహో భారతీయం, లింక్ ఫీల్డ్స్, సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఉగాది వేడుకల సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శివానంద సరస్వతి మాట్లాడుతూ జగన్మాత సరస్వశక్తి స్వరూపిణి అని శక్తిని ఆరాధించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. చిన్మయ మిషన్ అనంతపురానికి చెందిన యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ లలితా సహస్రనామ వైభవం అంశంగా ప్రసంగించారు. జయహో భారతీయం కార్యదర్శి శ్రీనివారెడ్డి అగస్త్య ఆధ్వర్యంలో రెండు వేల మంది మహిళలు ఐదుసార్లు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆధ్యాత్మికవేత్త యాబలూరి లోకనాథశర్మ, జయహో భారతీయం సభ్యులు మండవ శశిధర్, ఎం.వల్లీశ్వర్, వేణుమాధవ్ యలిగేటి పాల్గొన్నారు. మండలీక కృష్ణ ప్రసాద్ నిర్వహించారు.

నేత్ర పర్వంగా సాగిన నృత్య ప్రదర్శనలు

కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాశాల అధ్యాపకుడు చింతారవి బాలకృష్ణ బృందం, నవదుర్గల వైభవం నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు మనోజ్ఞ, శ్రీనృత్య చేసిన నృత్యం ఆకట్టుకుంది. ప్రత్యేక రక్షణదళం పోలీస్ కమాండెంట్ డాక్టర్ కేఎస్‌రావ్ దంపతులు అఖండ శంఖారావంతో కార్యక్రమాలకు శుభారంభం చేశారు. సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ నుంచి సిద్ధార్థ కళాశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు.

ప్రజల సహకారంతోనే మొదటి ర్యాంక్ సాధ్యం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



ప్రశంసా పత్రంను అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ నగరం మూడవ స్థానంలో ఉండటం మనకు గర్వకారణమని, దానిని అధిగమించి 2023లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవాలంటే మరింత ముందుకు వెళ్లాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. అందుకు నగరపాలక సంస్థ అధికారులతో పాటు ప్రజల సహకారం ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. నగరంలో ప్రతి ఇంటికీ మూడు (గ్రీన్, రెడ్, బ్లూ) చొప్పున బిన్స్ పంపిణీ చేశామని, ఏ రంగు బిన్‌ను దేనికి వాడాలో కూడా వివరించినా చాలా మంది ఒక బిన్ మాత్రమే వినియోగిస్తున్నారని తెలిపారు. ఇంటి నుంచి వెలువడే హానికర వ్యర్థాలను (శానిటరీ నాప్కిన్స్, డైపర్లు, సిరంజులు, కాలం చెల్లిన మందులు) పేపర్‌లో చుట్టి రెడ్ కలర్ బిన్‌లో వేసి పారిశుద్ధ కార్మికులకు అందచేయాలన్నారు. నగరపాలక సంస్థ స్వచ్ఛోత్సవ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో వచ్చే చెత్తనుకూడా వేస్ట్ చేయవద్దని, అరటి పండు తొక్కలు, ఉపయోగించిన టీ పొడి వంటి వాటితో హోం కంపోస్ట్ తయారు చేసుకుని ఇంట్లో పెంచుకునే మొక్కలకు వినియోగించుకోవాలన్నారు. అలాగే బియ్యం కడిగిన నీరు, మినప పప్పు, కందిపప్పు కడిగిన నీటిని మొక్కల పాదులో పోస్తే చక్కగా ఎదుగుతాయని చెప్పారు.

జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 64 డివిజన్లలో నూరు శాతం చెత్తను వేరు చేసి సేకరించడం, రోడ్లు, నివాస, వాణిజ్య, జనసమూహ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గార్బేజ్ ఫ్రీ సిటీ సెవన్ స్టార్ సాధించగలమని తెలిపారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించే దిశగా సమష్టి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నగరంలో 12 మంది ఉత్తమ పారిశుద్ధ్య మహిళా కార్మికులు, శానిటరీ సూపర్‌వైజర్లు, హోం కంపోస్ట్ చేస్తున్న ఆరుగురు మహిళలను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు. చివరిగా 64 డివిజన్ల నుంచి 64 మంది మహిళలతో గార్బేజ్ ఫ్రీ సిటీపై అవగాహన కల్పించేలా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, ఏసీజీ శ్యామల, సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను అలరించాయి. శ్రీనృత్య కళానిలయం నాట్యాచారిణి గోనిగుంట శ్రీశైలశ్రీ శిష్యబృందం చేసిన కూచినపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను రంజింప చేశాయి. తొలుత ఆలయ అర్చకులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను అభినందించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మాదినేని కృష్ణారావు, అధ్యక్షుడు కాటూరి వీరరాజు, కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

ముగిసిన వసంత నవరాత్రి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వసంతనవరాత్రి మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. శివకామేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీచక్రార్చన, ఛండీ హోమం చేశారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు అవ్వాహేమసుందర వరప్రసాద్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం అమ్మవారికి విశేషంగా పసుపు, కుంకుమ, పండ్లు, కూరగాయలు, గాజులు, తులసి, నారికేళం, వివిధ రకాల పూలతో అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్‌లో సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బెల్లంకొండ శివాచార్య స్వామి మహిళల చేత కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహింపజేశారు. తొలుత సీతారాములకు ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావటంతో సుమారు 400 మంది మహిళలు కుంకుమ పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షులు కంచర్ల రాము, కార్యదర్శి కొనకళ్ల సత్యప్రసాద్, కోశాధికారి ఎన్‌వీఆర్, గౌరవాధ్యక్షుడు చెరుకూరి కృష్ణకుమార్ పర్యవేక్షించారు.

త్యాగానికి ప్రతీక రంజాన్



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి ప్రతీక అని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు సమీపంలోని మసీదు నందు శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే ఈ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనటం ఆనందదాయకమన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన మార్గం అనుసరణీయమన్నారు. ముస్లింలు ఎమ్మెల్యే విష్ణును సత్కరించారు. అనంతరం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు పెద్దలు సయ్యద్ కరీముల్లా, షేక్ మస్తాన్, షేక్ అహ్మద్, ఎండీ జాకీర్, ఎండీ సుభాని, నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఉద్దంటి సురేష్, బండి వేణు పాల్గొన్నారు.

పేదలకు 'ఆసరా' కల్పించారు



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'రాష్ట్రంలో నిరాశ్రయులైన నిరుపేదలందరూ కొండంత అండగా... కుటుంబంలో పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా అందరికి చక్కని ఆసరాను కల్పించారు...'అని 63వ డివిజన్ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆ డివిజన్‌లోని 278వ వార్డ్ సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగింది. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ 260 గడపలను సందర్శించారు. స్థానికులు చెప్పిన పలు సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అందిస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో పోటీపడే సత్తా రాష్ట్రంలో ఏ ఒక్క రాజకీయ పక్షానికి లేదని ధీమావ్యక్తంచేశారు. కార్పొరేషన్ డీఈ గురునాథం, ఏఈ అరుణ్‌కుమార్, సీడీఓ జగదీశ్వరీ, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి పాల్గొన్నారు.

సీతారాములకు పూలంగి సేవ



పూజలు చేస్తున్న కార్పొరేటర్ శిరీష, సీఐ కృష్ణమోహన్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ కళ్యాణ రామాలయంలో 53వ శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యాన పూలంగి సేవ జరిగింది. పలు రకాల పుష్పాలతో ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూలంగి సేవ నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, గుణదల సీఐ కృష్ణమోహన్ సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం మేళతాళాలు డప్పు వాయిద్యాలతో మధురానగర్, పసుపుతోట వీధులమీదుగా స్వామివారి ఊరేగింపు జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోశుక్రవారం పలువుర కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు అలరించింది. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీ హనుమాన్ నృత్య కళానిలయానికి చెందిన పుష్ప, లలితప్రియ, దీపిక, సహాస్రలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లోంచి బయటకు వెళ్లిన తన తల్లి తిరిగి రాలేదంటూ శ్రీనివాస్ అనే వ్యక్తి శుక్రవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదలకు చెందిన మరీదు కనకలక్ష్మి(58) కుటుంబ సభ్యులతో వాగ్వివాదం జరిగిన నేపథ్యంలో గురువారం ఉదయం 11.30 గంటలకు ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో శుక్రవారం గుణదల పోలీసులను ఆశ్రయించారు. కనకలక్ష్మి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర ఝురి సంగీత మహోత్సవాలు ప్రారంభం



విజయవాడకల్చరల్: సంగీత రంగానికి విశేషమైన కృషి చేస్తూ వర్ధమాన సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్న స్వరఝురి 35వ వార్షికోత్సవ వేడుకలు దుర్గాపురంలోని రామకోటి ప్రాంగణంలోని శ్రవణసదనంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు టీఎస్ రామచంద్రరావు ప్రారంభించారు. 35 ఏళ్లుగా సంగీత సేవలు నిర్వహిస్తున్న సంస్థ కృషిని ఆయన అభినందించారు. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి వారి సంగీత సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్, సభ్యులు అంజనా సుధాకర్ పాల్గొన్నారు. తొలిరోజు కార్యక్రమంలో మల్లాది శివానంద యశస్వి వాగ్గేయకారులు త్యాగరాజు, రామదాసు, అన్నమయ్య, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్ రచించి స్వర పరచిన సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. అంబటిపూడి కామాక్షి, కామరాజు కార్తికేయ ఆదినారాయణ శర్మ, ఎం.హరిబాబు వాయిద్య సహకారం అందించారు.

నున్న పోలీస్‌స్టేషన్ ఎదుట టీడీపీ హైడ్రామా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నున్న పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు హడావుడి చేయడంతో శుక్రవారం ఆ స్టేషన్ ఆవరణలో హైడ్రామా నెలకొంది. కండ్రికలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సరిగా అందించడం లేదని, సదుపాయాలు కల్పించాలంటూ మార్చి 24వ తేదీన టీడీపీ నాయకులు ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఐపీసీ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండగా టీడీపీ నాయకులు వాటిని అతిక్రమించి ధర్నా చేసినట్లుగా గుర్తించి, ధర్నాలో పాల్గొన్న టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి నున్న పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న నార్త్‌జోన్ ఏసీపీ రవికాంత్, సీఐ కె.శ్రీనివాసరావులు సంఘటనా స్థలానికి చేరుకొని వారికి వాస్తవాలను వివరించి సమస్యను పరిష్కరించారు.